

# 28. చందవోలు తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి

## (1896-1990)

కారణజన్ములో, శాపగ్రస్తులో, యోగభ్రష్టులో మరల జన్మించి వచ్చినపని ముగించి ప్రారబ్ధం అనుభవించి కీర్తిశేషులౌతారు. అట్టివారిలో శ్రీలలితాపరాభట్టారికా శాసనం (శాపం?)తో పుట్టినవారు గుంటూరుజిల్లా చందవోలు వాసులు తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రిగారు. 18వ శతాబ్దంలో ఆత్రేయసులు 14 విద్యలెరిగిన రామభట్టు గోదావరీతీరంనుండి గుంటూరుజిల్లా మునిపల్లెకు వచ్చినారు. ఆయన కొడుకు సింగా భట్టు 3 వేదాలు 6 శాస్త్రాలలో పండితుడు. ఆయన కొడుకు సుబ్రహ్మణ్యావధాని ఆయన కొడుకు బుచ్చయ్య. బుచ్చయ్య భార్య అక్కలక్ష్మాంబ. వారి సంతానం లక్ష్మీ నారాయణ హనుమయ్యలు. హనుమయ్య ఇల్లాలు లక్ష్మమ్మ. వారి సంతానం వెంకటప్పయ్యశాస్త్రి సీతారామావధాని, బాలాత్రిపురసుందరి. రెండవవాడైన సీతారామావ ధాని పెదతండ్రికి దత్తుపోయినాడు. వెంకటప్పయ్యశాస్త్రి (1867-1934) భార్య గోరంట్ల వాస్తవ్యులు అన్నంభొట్ల వెంకటప్పయ్య వెంకట సుబ్బమ్మల కూతురు హనుమమ్మ. ఈ దంపతుల సంతానం 1. రాఘవనారాయణశాస్త్రి 2. హనుమచ్ఛాస్త్రి 3. బాలకోటీశ్వర

శాస్త్రి 4. సుశీల (భర్త జానకిరామశాస్త్రి) 5. లలిత (భర్త ధూళిపాళ రామరాయ) 6. అనసూయ (భర్త మేళ్ళచెఱువు సుబ్రహ్మణ్య శాస్త్రి 7. ప్రియంవద (భర్త దెందుకూరి చినహనుమద్ఘనాపాఠి). వీరిలో అగ్రజుడైన రాఘవనారాయణశాస్త్రిగారే మన కథానాయకుడు. వెంకటప్పయ్యశాస్త్రి వేదకాలపు ఋషి; పరమనిష్ఠాగరిష్ఠుడు, శాస్త్రకోవిదుడు, మహాకవి. ఆయన సంస్కృత కృతులు 4, ఆంధ్రకృతులు 20. అందులో శ్రీరామకథామృతము 24 వేల పద్యాల మహాకావ్యము. ఆయన చందవోలులో సంస్కృత పాఠశాలపెట్టి 40ఏండ్లు శతాధికవిద్యార్థులకు అన్నంపెట్టి వివిధ శాస్త్రములు సాహిత్యం బోధించినారు. తరువాత శంకరవిద్యాలయం నిర్వహించినారు. వారి చరిత్రం ఒక అద్భుతఖండం.

వెంకటప్పయ్యశాస్త్రి పెద్దకొడుకు రాఘవనారాయణశాస్త్రి జీవితచరిత్రం ఇంకొక అద్భుతం. ఆయనకు చందవోలు శాస్త్రిగారనీ, శాస్త్రిగారనీ వ్యవహారనామం. శాస్త్రిగారు శా.శ. ౧౮౧౮ దుర్ముఖినామసంవత్సర శ్రావణబహుళవిదియ మంగళవారం రాత్రి వృషభలగ్నంలో (25-8-1896) గుంటూరు సమీపం గోరంట్లలో మాతామహులింట పుట్టినారు. 5వయేట అక్షరాభ్యాసం జరిగింది. తాత తండ్రులకు అక్షరాలు నేర్పిన మాచిరాజు దండయ్య పంతులుగారే ఈయనకూ ఓనమాలు పెట్టినారు. తాడికొండ వాసులు కేదారలింగంగారు బాలాత్రిపురసుందరీ మంత్రం ఇచ్చినారు. 16వ సంవత్సరం దాకా ఆ మహామంత్రోపాసన చేసినందున శాస్త్రిగారు పిలిచితే అమ్మవారు పలికేది. దెందుకూరి పానకాలశాస్త్రిగారివద్ద తర్కం తాడికొండ ముదిగొండ నాగలింగశాస్త్రిగారివద్ద సిద్ధాంతకౌముది, పాదిలి సీతారామశాస్త్రిగారివద్ద మంత్రం నేర్చినారు. నూనూగు మీసాల ప్రాయంలోనే శాస్త్రిగారు సన్న్యసించదలచినారు. ఈ బుద్ధి ఈయనకు ఎందుకు పుట్టిందో ఈయన పూర్వజన్మ ఏమిటో కనుగొన ప్రయత్నించినారు వెంకటప్పయ్యశాస్త్రిగారు. గుంటూరు వాసులు గోవిందరాజుల సీతారామయ్య భార్య శ్యామలాంబ గొప్ప యోగిని. ఆయమ్మ సూర్యమండలాంతర్వర్తియైన మహాసిద్ధు డెవరో ఇట్లా జన్మించినాడన్నది. స్వయంగా మన శాస్త్రిగారికే స్వప్నంలో పినతల్లి చూపిన దృశ్యం గోచరించింది. అందులో తానొక సిద్ధుడు. శ్రీచక్రేశ్వరియైన కామేశ్వరి అల్లంత

దూరాన నున్న యువతులను తీసుకరమ్మన్నది. ఒకతనెత్తుకొని ఇరువురిని తోడ్కొని వచ్చినాడు. అమ్మవారు చిరునవ్వుతో నీ మనస్సు కొంచెం చలించింది. మీరందరూ భూలోకంలో జన్మించండి. నీవు మోసిన సుందరి నీ అర్ధాంగి ఔతుందన్నది. 19వయేట శాస్త్రిగారుద్వాహమైన పార్వతి తాను కలలో మోసుకతెచ్చిన యువతి అచ్చుపురూపం. పార్వతి అద్దేపల్లి మంగమ్మ, పాపయ్యశాస్త్రుల తనయ. పినతల్లి కలలో చూపిన బొమ్మకూడ ఈమె రూపమే. శాస్త్రిగారామె పేరు శ్రీదేవిగా మార్చినారు. కనుక ఈ దంపతులిద్దరు దేవభూమినుండి దిగివచ్చిన కారణజన్ములు.

శాస్త్రిగారు తండ్రిగారికి తోడుగా పాఠశాలను నిర్వహిస్తూ వేదాంతోపన్యాసాలు చేస్తుంటే ఆకృష్టులైన జిజ్ఞాసువులు అమెరికాకు రమ్మన్నారు. శాస్త్రిగారికది యిష్టం లేదు. విద్యావ్యాసంగంలో కాలం గడుపుతూ పినపాటి వీరభద్రయ్యతో నేత్రావధానం, ఏలేశ్వరపు పురుషోత్తమశాస్త్రి రాఘవయ్యలతో కవిత్వసాధన చేసినారు. వివిధ సంస్థలు సభలవారు శాస్త్రిగారికి 400 సర్టిఫికేట్లిచ్చినారు. అప్పటి గవర్నరు పెంట్లాండుగారితో స్నేహమైనది. శాస్త్రిగారే శాఖోద్యోగి వద్దకుపోయినా అగ్రాసనమిచ్చి వారి పనులు వెంటనే చేయవలసిందని గవర్నరు ఆదేశమైనది. తమ వ్యాకరణగురువులు ముదిగొండ నాగలింగశాస్త్రి గారితో పెక్కుచోట్ల అవధానాలు చేసి పారితోషికాల ధనం గురువులకే సమర్పించినారు. పుష్పగిరి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖర భారతీస్వామి సన్నిధిలో జరిపిన అష్టావధానానికి స్వామివారు మెచ్చి ఉభయశ్లేషకు లక్ష్యంగా ఒక శ్లోకం చెప్పుమన్నారు. శాస్త్రిగారు ఝటితిస్ఫూర్తితో "యస్యాష్ట భాషాకవితా లతాంగీ, జాయేవ నీతా ప్రణయేన శయ్యామ్, మనోహరంతీ ఖలు హావభావైః కీర్తిం ప్రసూతే భువనాభివంద్యామ్" అని చెప్పినారు. స్వాములవారు "స్త్రీసంతత్యైవాస్య వంశ ప్రతిష్ఠేతి స్ఫురతి" అన్నారు. అదే నిజమైనది.

శాస్త్రిగారీ విధంగా విద్యావినోదాలతో దేశం తిరుగుతూ ఒకసారి ఇంటికి వచ్చినారు. పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నవి. ఆర్థికంగా పూట గడవని స్థితి అది. 10 వేల ఋణబాధ, పాఠశాల ఇబ్బందులు గమనించి శాస్త్రిగారు ఇంటివద్దనే నిలిచిపోయి తండ్రిగారికి చేదోడువాదోడైనారు. ఒకసారి కుటుంబసభ్యులందరూ మూడుదినాలు

వస్తులుండవలసి వచ్చింది. శాస్త్రిగారు మూడవనాటి రేయి 27సార్లు లలితాసహస్ర నామార్చన చేసి అమ్మవారికి నివేదన చేసిన జలమే త్రాగి మందిరం వద్ద అంగవస్త్రం పరచుకొని నిద్రించినారు. కలలో 10 ఏండ్ల బాల గలగలా వచ్చి "ఓరీ! ముష్టిపెడుతాను కొంగుపట్టు"మని దోసెడు బియ్యం పోసి, "బండి వస్తుంది దానిపై పో"మ్మన్నది. తెల్లవారి ఖాజీపాలెం సీతారామరాజుగారి బండి వచ్చింది. అక్కడ రాజుగారి కోరికమేరకు శాస్త్రిగారు పురాణం చెప్పి రాత్రి ఇంటికి వచ్చేసరికి తలుపుకడ్డంగా రాజుగారు పోయించిన పుట్టెడు ధాన్యపురాశి కనపడింది. ఆనాటినుండి శాస్త్రిగారికెట్టి దారిద్ర్యం లేదు.

శాస్త్రిగారు ఖాజీపాలెంలో 7 మాసాలు, ఇంకా పిట్లవారిపాలెం, గోకరాజుపాలెం, రాచపాలెం, కొల్లూరు, నగరం, పూషడవారి పాలెం, అలకాపురి మొదలైన పెక్కుచోట్ల దేవీభాగవతం, హరివంశం, తండ్రిగారి రామకథామృతం, తమ దత్తభాగవతం చాలాసార్లు పురాణం చెప్పుతూ రాత్రికి ఇంటికి చేరి, ఇంటివద్దనే తపస్సు, ప్రాణాయామం సంపన్నం చేసుకున్నారు. తండ్రిగారివలె శాస్త్రిగారు గొప్ప నిష్ఠ గలవారు. పట్టుదల ఇంకా యెక్కువ. చిన్ననాడొకసారి వేరుశనగకాయలు తీసుకుంటుంటే మేనత్త సుందరమ్మ కటువుగా మాట్లాడింది. నాటినుండి వేరుశనగలు తినలేదు. నూనెకూడ వంటల్లో వాడనీయలేదు. ఇంకా దొండకాయ, రామములక, ఆలుగడ్డ, ముల్లంగి, క్యాబేజి ముట్టలేదు. ఒకసారి రైలు ప్రయాణం చేస్తుంటే కుఱ్ఱవాళ్ళు సిగరెట్లు త్రాగుతూ పొగవదలుతున్నారు. ఆయన కిటికీవద్ద కూర్చోవటానికి వాళ్ళు అనుమతించలేదు. నాటినుండి కాశీకి తప్ప ఎక్కడికీ రైలు ప్రయాణం చేయలేదు. ధర్మపాలనలో వారు ఆపద్ధర్మం, పక్షాంతరం, వికల్పం, అర్థవాదమని వంకపెట్టి కక్కుర్తి పడలేదు. శ్రీదేవి శాస్త్రి దంపతులకు లక్ష్మీనారాయణ అనే కొడుకు శ్రీలక్ష్మి అనే కూతురు కలిగినారు. లక్ష్మీనారాయణ 10ఏండ్ల ప్రాయంలోనే చనిపోయినాడు. కూతురును చెఱువుశేషయ్యశాస్త్రికిచ్చినారు. వారి సంతానమే చెఱువు సత్యనారాయణశాస్త్రి, తణుకు సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్. ఆయన వెంకటప్పయ్య శాస్త్రి రాఘవనారాయణశాస్త్రుల జీవితచరిత్రం రచించిన ధన్యుడు, చంద్రశేఖర భారతీ స్వామి వాక్కులు యదార్థం చేసిన పండితకవి.

రాఘవనారాయణ శాస్త్రిగారికి అష్టసిద్ధులు కైవసము. ఇబ్బందులెన్ని వచ్చినా ప్రారబ్ధమని అనుభవించినారే కాని స్వార్థానికి వాడు కోలేదు. వారి మంత్రయోగముల మహిమలు వింతకథలుగా ఉంటవి. శ్రీవారి యోగశక్తులు వారిశిష్యులు వోరి సత్య నారాయణశర్మ భోగేశ్వరశర్మలెరుగుదురు. శాస్త్రిగారి జీవితంలోను వారి ఆశ్రితుల జీవితాల్లోను సంఘటిల్లిన కొన్ని సన్నివేశాలు.

1. శాస్త్రిగారు చదివిన తాడికొండ వేదపాఠశాల దయ్యాలకొంప. రాత్రులెవరూ అందులో ఉండరు. ఒకనాడెట్లో వారు పడుకుంటే సహపాఠులు పొరపాటున బయట గొండ్లెంపెట్టి పోయినారు. అర్ధరాత్రి ఒక దిగంబరి జుట్టు విరబోసుకొని సమీపిస్తుంటే శాస్త్రిగారు మంత్రం పఠించినారు. ఆ స్త్రీ మంత్ర మాపుమంటే ఇంకా బిగ్గరగా పఠించి నారు. దయ్యం పారిపోయింది.

2. ఆదినాల్లోనే శాస్త్రిగారికి వశ్యంకరణౌషధి 'మయూరశిఖి' సంపాదించ సంకల్పం కలిగి చంద్రగ్రహణసమయాన తాము కొండెక్కి, తళతళ మెరిసే ఆ మొక్కను గుర్తు పట్టినారు. తీసుకుందామని సమీపిస్తే ఒక మూడుతలల బాలుడు అడ్డుపడ్డాడు. తొలగు మంటే బాలుడు తొలగలేదు. శాస్త్రిగారు బలవంతాన ఆ మొక్కను పట్టుకోబోతే బాలుడు నిరోధిస్తూ "నీకీమొక్కతో పనిలేదు. ముఖం చూస్తేనే అందరూ వశులౌతా" రంటూ పెనగులాడినాడు. ఇంతలో గ్రహణం వీడింది. బాలుడదృశ్యుడైనాడు. మయూర శిఖి మెరుపులు మాయమైనవి. తమకీ ఓషధి పొందే యోగం లేదని శాస్త్రిగారు కొండ దిగినారు. ఆ ఓషధికి దత్తాత్రేయస్వామి అధిపతి.

3. ఆ దినాల్లోనే శాస్త్రిగారికి పూర్వజన్మసఖుడైన యోగి దర్శనమిచ్చి సంసార సుఖదుఃఖాలు సమంగా భావించవలెనని మరల 50 సంవత్సరాలకు కనపడతాననీ చెప్పి అదృశ్యుడైనాడు. సరిగా 50 సంవత్సరాల తరువాత శాస్త్రిగారు అమరావతికి పోయి అమరేశ్వరస్వామి నర్చించి తమ గదిలో ప్రాణాయామం చేస్తూ చాలా పైకిలేచి తల క్రిందులుగా పడిపోతుంటే తలనేలకు తగిలేసమయానికి ఆయోగి వచ్చి రక్షించినాడు. శాస్త్రిగారు నమస్కరించగనే యోగి అదృశ్యుడైనాడు.

4. వెంకటప్పయ్యశాస్త్రిగారు కైలాసవాసులైన తరువాత వారి శ్రీరామకథామృత శేషపూరణ చేస్తూ వెంటవెంట శాస్త్రిగారు ముద్రిస్తున్నారు. అయోధ్యాకాండలో గాయత్రీ మంత్రంలోని భ వర్ణంతో పద్యం వ్రాయటానికి మూడుదినాలు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. తమ ఉపాస్యదేవతను ప్రార్థించి శాస్త్రిగారు నిద్రించినారు. కలలో ఒక బీబీ జగన్మోహిని శయనించి ఉండగా 30 ఏండ్ల గడ్డంవాడొకడు ఆమె చొక్కా పైకెత్తి పాలు కుడుస్తున్నాడు. శాస్త్రిగారా దృశ్యం చూస్తుంటే ఆమె ఎందుకు నిలబడ్డావన్నది. "నాకూ కొంచెం పాలిస్తావా" అన్నారు శాస్త్రిగారు. వెంటనే మెలకువ కలిగి "భర్మమయ రమ్యహర్మ్యము" పద్యం కుదిరింది. ఆనాటినుండి శాస్త్రిగారు ఉత్తరకాండంలో రేపు ముద్రించవలసిన పద్యాలు ఈ రేయి వ్రాస్తూ పగలు ప్రూఫులు దిద్ది పూర్తిచేసినారు.

5. చందవోలు కేతరాజా సుబ్బారావుగారికి సంతానం లేదు. రాయవేలూరు వైద్యులాయన భార్యను పరీక్షించి ఆమెకు సంతానభాగ్యం లేదన్నారు. దంపతులు శాస్త్రిగారి నాశ్రయిస్తే వారామెకు సంవత్సరకాలం తీర్థవిభూతులిచ్చినారు. కాన్పుకు ఆమె రాయ వేలూరు ఆసుపత్రికే పోయింది. ఏడాదిక్రింద పరీక్షించి సంతానం కలుగదన్న డాక్టరు నివ్వెరపోయినారు. అయమ్మ సుఖంగా ప్రసవించి ఆడపిల్లను కన్నది. పెరవలి వాసులైన చెఱువు విశ్వనాథశర్మ దంపతులు శాస్త్రిగారినాశ్రయించియే సంతానవంతులైనారు.

6. శాస్త్రిగారు శ్రీరామకథామృత ముద్రణకై చందాలకోసం సత్తెనపల్లిలో ఒక బ్రాహ్మణుల యింట్లోకి పోతుండగా ఒక 20 సంవత్సరాల యువతి వారిని చూచి నమస్కరించి లోనికి పోయింది. ఆ యింటివారికాశ్చర్యమైనది. ఆమె గ్రహగ్రస్త. జుట్టు విరబోసికొని అందరినీ కొడుతూ తిడుతూ ఎవరైనా బలిష్ఠులు పట్టుకున్నా విడిపించుకొని వీథిలోనికి పరుగెత్తి ఆగం చేసేది. అట్టి యువతి శాస్త్రిగారిని చూచి సౌమ్యురాలైనది. ఇంటివారామె విషయం మనవి చేస్తే వారామెను పిలిపించి గ్రహప్రేరణ చేసి ఏం చేస్తే నీవు విడిచిపోతావన్నారు. ఆమె సహస్రగాయత్రీ తపఃఫలం ధారపోస్తే తొలగిపోతానన్నది. శాస్త్రిగారు స్నానానుష్ఠానములు ముగించి గ్రహనివృత్తికై సంకల్పించి సహస్రగాయత్రీ జపం చేసి ధారపోసినారు. ఆ గ్రహం ఇంటిముందున్న వేపచెట్టు కొమ్మ విరిచి వెళ్ళిపోయింది.

7. శాస్త్రిగారొక నాగులచవితినాడు కాలువలో స్నానం చేసి మోరదిబ్బ తిరిగి వస్తుంటే నాగలిచాలులో పడుకున్న కాలసర్పం తోకపై అడుగు పడింది. వెంటనే ఆ పాము పడగెత్తి నిలువెత్తు లేచి బుసలు కొడుతూ కాటువేయ చూస్తుండగా శాస్త్రిగారు నిలిచి గారుడమంత్రం జపించినారు. సర్పం తలవంచి నేలకొరిగింది. శ్రీవారు దిగ్బంధన మంత్రముపసంహరించి "స్వామీ నీజోలికి నేను రాలేదు. నాజోలికి నీవు రావద్దు. పొరపాటున కాలు తగిలింది. వెళ్ళిపొండి" అనగానే పాము వెళ్ళిపోయింది. ఆనాడంతా శాస్త్రిగారు గారుడమంత్రం పఠించినారు. రాత్రికూడ మహాగరుడుడు తమచుట్టు తిరుగుతూ కాపలా కాస్తున్నట్లు కనపడింది.

8. శాస్త్రిగారు తమ 90ఏండ్ల జీవితంలో 80 ఏండ్లు బాలామంత్రానుష్ఠానం చేసిన పుణ్యపురుషులు. వారొకసారి కాశీయాత్ర చేసినారు. గంగాస్నానం చేస్తుండగా గంగమ్మ గలగలలాడే బంగారు గాజాలున్న చేయి చాచి నాకేమి కానుక తెచ్చి నావన్నది. శాస్త్రిగారికెటూ తోచక వ్రేలికున్న దర్భ ఉంగరం ఆమె చేతిలో పెట్టినారు. బసకు తిరిగివచ్చి దేవతార్చన సంపుటి తెరిస్తే గంగకర్పించిన ఉంగరం కనపడింది. తాము భ్రాంతిపడ్డామా, అపచారం, అనౌచిత్యం చేసినామా అనుకుంటూ ధ్యానమగ్నులైనారు. ఆ ధ్యానంలోనే తూగు వచ్చింది. గంగమ్మ కనపడి "కానుకడిగితే దర్భముడి ఉంగర మిచ్చితేమిరా?" అది నీ పితృతర్పణాల కుపయోగపడుతుందే కాని నాకు ఆభరణం ఎట్లౌతుంది?" అని ప్రశ్నించినది. "అమ్మా నేను నీకేమీ తేలేదు. నీవడిగితే అనాలోచితంగా నావద్ద ఉన్న"దిచ్చి"నావన్నారు. గంగమ్మతల్లి "ఇది నాకెందుకు? నీ భార్యవద్ద నాకై తెచ్చిన నగ ఉంది తే" అన్నది. శాస్త్రిగారికి మెలకువై శ్రీదేవమ్మ నడిగితే ఆమె కాసులగొలుసు కానుకగా తెచ్చినానన్నది. శాస్త్రిగారది తీసుకొని గంగకు పోయి గంగాభవానిని ప్రార్థించి కానుక సమర్పించి వచ్చినారు. ఆ దంపతులకు దేవతలతో గల చనువట్టిది. ఇట్టి మహిమలనేకం శ్రీ చెలువు సత్యనారాయణశాస్త్రిగారు రచించిన గ్రంథంలో ఉన్నవి. శ్రీవారు రాత్రివేళ భీమవరంనుండి నర్సాపురం పోతూ రాత్రిపూట హంతకులకు పట్టుబడి అమ్మవారి అనుగ్రహంతో ఆ హంతకులచే పూజలందుకున్న ఘట్టం ఒడలు జలదరింపజేస్తుంది. గట్టి లక్ష్మీనరసింహాశాస్త్రి గారీ ఘట్టాన్ని 'అగ్నిపరీక్ష' నవలగా వ్రాసినారు.

శాస్త్రిగారి తపస్సును మహిమలను బాగా ఎరిగినవారు కాంచీపరమాచార్యులు. ఈ ప్రాంతాల భిక్షులు వారిని దర్శించటానికి కంచికి పోతే "ఇంతదూరం రావలసిన పనిలేదు. చందోలులో లలితాత్రిపురసుందరీ ఉపాసకులు శాస్త్రిగారున్నారు కదా! ప్రతి గురువారం వారిని దర్శించండి" అని హెచ్చరించేవారు. అట్టిది శ్రీవారి మహిమ. శ్రీవారు తమకోసం మాత్రమే తపస్సు చేయలేదు. కులమత భేదం లేకుండా ఆర్తులకు దీనులకు ప్రతిఫలాపేక్ష లేకుండా తమ తపస్సు ధారవోసి సుఖసంతోషాలు ప్రసాదించి నారు, ఇతరుల ఆనందమే తమ ఆనందంగా భావించిన త్యాగధనులు వారు. శ్రీవారిని శుశ్రూషించి చదువుకున్నవారు మంత్రదీక్షితులైన వారు వందలసంఖ్యలో ఉన్నారు. అగ్రవర్ణులకే కాదు వారు శూద్రులకు కూడ మంత్రమిచ్చినారు. ఒకసారి గుడిపల్లి సాయివరప్రసాదరావు, గుంటూరు పుయ్యూరు లక్ష్మీనరసింహారావు మిత్రులు చందోలుకు పోయి శాస్త్రిగారికి పాదాభివందనం చేసి ఒకరుద్యోగం మరొకరు సంస్కృతవిద్య అడిగి నారు. శ్రీవారట్లేయని దీవించినారు. సాయివరప్రసాదరావు ప్రభుత్వకళాశాలలో తెలుగు లెక్చరరయినాడు. లక్ష్మీనరసింహారావు సంస్కృతవ్యాకరణం వచ్చే ఉపాయమడిగితే వ్యాకరణం సూర్యమండలంనుండి రావలె, గాయత్రీమంత్ర జపం చేయుమన్నారు. ఆయన నేను శూద్రుడనంటే పురాణోక్త సూర్యమంత్రముపదేశించినారు. ఆ మంత్రం అనుష్ఠించి లక్ష్మీనరసింహారావు వ్యాకరణపాండిత్యమే కాదు గొప్ప సంపద యశో ప్రాభవాలు సంపాదించినాడు. రెసిడెన్షియల్ స్కూళ్ళ కధిపతియైన లక్షాధికారి లక్ష్మీ నరసింహారావుగారు. శాస్త్రిగారు గొప్ప ఆగమశాస్త్ర పండితులు. తమ ఆశ్రమంలో దత్తాత్రేయ, సుబ్రహ్మణ్య, సీతారామ లక్ష్మణ హనుమత్ ప్రతిష్ఠలు తామే చేసినారు. ఇంకా వేకనూరులో లలితా త్రిపురసుందరీ, తెనాలిలో బాలాత్రిపురసుందరీ ప్రతిష్ఠలు చేసినారు. ఇతర పెక్కుచోట్ల యంత్రాలు స్థాపించినారు.

శాస్త్రిగారు గొప్ప పండితకవులు. శ్రీవారి ముద్రిత రచనలు 1. హేమదుర్గాంబికా శతకము 2. తుకారామదాసు చరిత్రము 3. నా యోగము 4. పాడినపాట 5. పాండు రంగేశ్వర ప్రశస్తి 6. బాలాత్రిపుర సుందరీ సమేత రాజరాజ నరేంద్రస్తవము 7. శాంకరీస్తవము 8. నా యాత్ర 9. ప్రభుప్రపత్తి 10. సహస్ర లింగేశ్వరస్తుతి 11. నాకులోచిన

మాట 12. ఇంకొక మాట (వ్యాసాలు) 13. మత్స్యప్న: (సంస్కృతం) 14. దత్తాత్రేయాష్టక గర్భితాత్మ సుప్రభాతము 15. ప్రారబ్ధ ప్రాబల్యము 16. వాసుదేవ సారథ్యము 17. దత్త భాగవతము 18. శ్రీరామ కథామృతశేషపూరణము 19. శివలీల.

శాస్త్రిగారు కృతజ్ఞత మూర్తీభవించిన సాధుసత్తములు. తమకు ఓనమాలు నేర్పిన గురువులు మొదలు మంత్రాలు వ్యాకరణం బోధించిన గురువులవరకు తల్లిదండ్రులకు భక్తితో ప్రణమిల్లటం వారినిత్యపూజావిధి. విశ్వశ్రేయస్సు కోసం భూమికవతరించి బ్రహ్మర్షి తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు పూర్ణపురుషాయుషం జీవించి దేహం చాలించే తేది నిర్ణయించుకొన ఏడుదినాలు ప్రాయోపవేశం చేసి శా.శ.౧౯౧౨ ప్రమోదూత సంవత్సరం మార్గశిర బ॥ నవమి 10-12-1990 సోమవారంనాడు జగన్మాత ఒడిలో చేరిపోయినారు. అమ్మవారి శాపంతో భూమికవతరించి మరల అమ్మవారి ఒడిలో చేరిన శ్రీవారి గాథ పరమాద్భుతం. వారి శరీరానికి అగ్నిసంస్కారం చేసినపుడు చితి మంటలు అమ్మవారి ఆకృతిగా ఆకాశానికి లేవటం అద్భుతం. ఆనాటి ఛాయాచిత్రం 8-9-1991 ఆంధ్రప్రభ ఆదివారం సంచికలో ఎస్.సూర్యప్రకాశ్‌రావు వ్యాసంతో ఉన్నది.

నేను 24-2-1995 శుక్రవారం నాడు అలకాపురి మంతెన కృష్ణంరాజుగారు తోడుగా చందవోలుకు శాస్త్రిగారింటికి పోయి శాస్త్రిగారి పూజాగృహంలో అర్చన, శాస్త్రి దంపతుల ఛాయాచిత్రములు చూచి ప్రసాదం అందుకున్నాను.

**ఆధారం :**

1. శ్రీరామకథామృత కవికుమార జీవితము - చెఱువు సత్యనారాయణ శాస్త్రి. 2. శారదా కళాశాల పత్రిక 1992.3. డా॥ వి. లక్ష్మీనరసింహారావు, జి-2, బృందావన గార్డెన్స్, గుంటూరు - 522 007. గారి విపులమైన వ్యాసం.